కథ

# బ్రతుకుపోరు

సిహెచ్. మధు

**అల్లం నర్సింలు తన రెండో కొడుకు గూర్చి ఆలోచిస్తున్నాడు. ఎంత ఆలోచించినా, ఆలోచనలు ఒక కొలిక్కి రావటం లేదు. పదిరోజులుగా ఆలోచిస్తున్నాడు రాత్రింబగల్లు ఆలోచన... కొడుకును సంప్రదించలేదు. భార్యను సలహా అడుగలేదు. రెండోకొడుకు గూర్చి పెద్ద కొడుకు దగ్గరమాట్లాడలేదు. మాట్లాడాలని లేదు. ఎవరేం చెపుతారు? ఎవరికేం తెల్సుకనుక! ఇది ఆయన ఆలోచన.**

తానే ఓ నిర్ణయానికి రావాలి అనుకొన్నాడు. మిన్ను విరిగి మీద పడనున్న సమస్య కాదు. కానీ అదో సమస్యే! రెండో కొడుకు భవిష్యత్ సమస్య పాతకాలంలో అనేవారు "ఏమైందిరా నీకు రెక్కలున్నాయి చేసుకొని బ్రతుకరాదా?" పని దొంగలను, దొంగలను, అడక్కతినేవారిని అనేవారు. ఇప్పుడు ఆ మాట అనటానికి కూడా సంకోచమే" రెక్కలున్నా లాభం లేదు. కడుపు నింపుకోవటానికి చాలటం లేదు. తెలివివున్నా లాభం లేదు. తెలివి తేటలతో రెండు పైసలు సంపాదించటం కష్టమే! అంతెందుకూ? ఎంత చదివినా ఉద్యోగాలు దొరకటం లేదు. ఇంకెందుకూ? జీవితం భద్రంగా లేదనటానికి ఈ ఉదాహరణ చాలు. అయితే బ్రతుకవచ్చు. ఆటోనడిపి, రిక్షాలాగి కూలీచేసి, కూరగాయలమ్మి, పండ్లు ప్యాలాలు అమ్ముకొని బ్రతకొచ్చు. ఇవి కడుపునింపవు. సగం కడుపు ఖాళీగానే వుంటుంది. ఈ బ్రతుకులో సమస్యలున్నాయి. పోలీసులు ఆటోవాళ్ళను బ్రతకనివ్వరు. రిక్షాలు కనుమరుగవుతున్నాయి. యంత్రాలు కూలీల కడుపుకొట్టాయి. కూరగాయలు పండ్లు ప్యాలాలు ఈ వ్యాపారాలు ఎప్పుడు ఎలా వుంటాయో ఎవరికీ తెలియదు. డబ్బుంటేనే ఏదైనా వ్యాపారం. డబ్బులేక వ్యాపారమంటే చిన్నదైనా.. మిత్తీలు తినేస్తాయి. వందకు నెలకు పది తీసుకునే వారున్నారు. ఎలా బ్రతకటం. ఎక్కడైనా జీతముండి... ఉద్యోగం చేసి అనేది నాజూకు పదం.. జీతం.... యజమాని యిష్టం. అదే దొరకాలి. లేబర్ రూల్స్ లేవు. అక్కడ లెక్కలు వ్రాయటానికి యంత్రాలొచ్చాయి. సెలవులు లేవు. ఆదివారాలు లేవు. ఎనిమిది గంటలు లేవు. బ్యాంకులు గవర్నమెంట్ ఆఫీసులు ఎనిమిది గంటలు పాటించటం లేదు. ప్రైవేట్ జాబ్‌ల సంగతేమిటి? –

ఇదే బ్రతుకు సంగతి తన రెండో కొడుకు బ్రతుకు సంగతి ఆలోచిస్తున్నాడు అల్లం నర్సింలు.

అల్లం నర్సింలుకు ఇద్దరు కొడుకులు. మొదటి కొడుకు పాతికపైనే ఉంటాడు. పెళ్ళి అయ్యింది. ఇద్దరు పిల్లలు. ఆయన పేరు ప్రసాద్.

రెండో కొడుకు ఇరువది పైన వుంటాడు. ఇంకా పెళ్ళి కాలేదు. డిగ్రీ పాసయ్యాడు ఆయన పేరు ప్రకాష్.

అల్లం నర్సింలుది తెలంగాణలో ఓ గ్రామం. అల్లం నర్సింలు వ్యవసాయం చేసుకొని బ్రతుకుతాడు. ఆయనకు మూడెకరాల పొలం వుంది. అది తాతలు సంపాదించిన పొలం. ఐదు ఎకరాలు ఉండేది. ఒక ఎకరం ఓసారి ఒక ఎకరం ఓసారి రెండు ఎకరాలు అమ్మాడు అల్లం నర్సింలు. మూడు ఎకరాలున్న మంచి రైతుగా ఆ ఊరిలో పేరు పొందాడు. బాగా కష్టపడతాడు. మూడు ఎకరాలలో ఎన్నో పంటలు పండిస్తాడు. బోరుబావి వుంది. అలా కష్టపడే ఇద్దరు పిల్లలను డిగ్రీవరకు చదివించాడు.

అల్లం నర్సింలు గ్రామంలో యస్.యస్.సి. వరకే వుంది. అయినా పట్టుదలగా జిల్లా కేంద్రానికి పంపించి ఇద్దర్ని చదివించాడు. ఇద్దరు మగపిల్లలే కనుక ఆయనకేం ఫికరు లేదు గానీ వాళ్ళ బ్రతుకుల గూర్చే ఆయన ఫికరు.

తనకు పుట్టిన పిల్లలు ఎలా బ్రతుకుతారనేది ఆయనకు పెద్ద ఫికరు అయ్యింది. తన బ్రతుకు ఆఖరు ఘట్టంలో వుంది. మెల్లమెల్లగా జీవితాన్ని లాక్కొస్తున్నాడు. తన బ్రతుకు కూడా సుఖంగా లేదు. శాంతిగా లేదు. పది సంవత్సరాల క్రితం కొంత బాగుండేది. ఇంత ఫికరు వుండేది కాదు. ఇన్ని ఖర్చులు ఉండేవి కావు. ఇంతగా ధరలు వుండేవి గాదు. ఆకాశమెత్తు ధరలు ఎందుకు పెరుగుతున్నాయో ఆయనకు అర్థం కాలేదు. కొనబోతే నిప్పు అమ్మబోతే బూడిద అన్నట్టుగా వుంది పరిస్థితి. తన బ్రతుకు ఇప్పటి వరకు ఎలాగో లాగుతున్నాడు. ఇటీవల అప్పు పెరిగింది. వ్యవసాయంలో గిట్టుబాటు కావటం లేదు. వేరేమార్గం లేదు. ఎలాగో నెట్టుకరావాలి.

పిల్లల బ్రతుకుల సంగతేమిటి? వాళ్ళు ఎలా బ్రతకాలి? వాళ్ళ భవిష్యత్తు ఏమిటీ?

చిన్నోడు ప్రకాష్ డిగ్రీ అయిపోయింది. ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడు. వారంరోజుల క్రితం రిజల్ట్స్ వచ్చాయి. ఇప్పుడు ఏం చేయించాలనేది ఆయనకు అంతుబట్టడం లేదు.

ఆరుమాసాల క్రితం అందరూ కల్సి ఓ నిర్ణయం తీసుకున్నారు. డిగ్రీ కాగానే ప్రకాష్‌ని ఎం.బి.ఎ. చదివించాలని. ఎంత కష్టమయినా హైదరాబాద్ పంపించి– ఎక్కడికయినా పంపించి ఎం.బి.ఎ. చదివించాలని... ఎం.బి.ఎకు భవిష్యత్తు ఉందని అప్పుడు అనుకున్నారు.

అప్పటినుండి తాను ఎం.బి.ఎ. చదువుతానని,

చదవటానికి హైదరాబాద్ వెళ్తానని ప్రకాష్ మిత్రులతో అంటున్నాడు. అందుకు ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నాడు. ఎం.బి.ఎ. చదివితే ఉద్యోగం ఈజీ అని అల్లం నర్సింలు భావించాడు. ఆయన కొడుకు భావించాడు. అందుకొరకు, కొడుకును ఎం.బి.ఎ. చదివించటానికి అల్లం నర్సింలు అక్కడ ఇక్కడ అప్పుచేసి రెండు లక్షలుకూడా చేతులో వుంచుకున్నాడు.

అయితే–

ఒక మాసం నుండి అల్లం నర్సింలు తన రెండో కొడుకు ఎం.బి.ఎ. చదువు గూర్చి సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు. చదివించాలా? వద్దా? అలా ఆయన ఆలోచిస్తున్నట్టుకూడా ఎవరికి తెలియదు. భార్యకు కూడా తెలియదు. సీరియస్‌గానే ఆలోచిస్తున్నాడు. ఆయన అలా ఆలోచించడానికి రెండు కారణాలున్నాయి.

❖ ❖ ❖

అల్లం నర్సింలు పెద్దగా చదువుకోలేదు. కానీ సామాజిక జ్ఞానం మెండుగా వుంది. ప్రపంచ జ్ఞానం కొంత తెల్సు. ఆర్థికమాంధ్యం అంటే ఆయనకు అర్థంకాలేదు. కానీ ప్రపంచవ్యాప్తంగా కొన్ని పరిశ్రమలు మూతపడుతున్నాయని అందులోని ఉద్యోగులు వీధినపడ్డారని ఆయనకు తెల్సిపోయింది. ఇదో కారణం కాగా రెండో కారణం భారతదేశంలో కూడా కొత్త ఉద్యోగాలు రావటం లేదని ఇక్కడ కూడా వున్న ఉద్యోగాలలో కోత పెడుతున్నారని అల్లం నర్సింలుకు తెల్సిపోయింది. తెల్వటం కాదు స్వయంగా అనుభవమయ్యింది.

డిగ్రీ చదివిన మొదటి కొడుకు ప్రసాద్ రెండు సంవత్సరాల క్రితం ఉద్యోగం చేసుకొని జీవిస్తానని హైదరాబాద్ వెళ్ళాడు. డిగ్రీలో ఫస్టుక్లాసులో ర్యాంకులో పాసయ్యాడు కనుక ఒక గడియారం ఫ్యాక్టరీలో ఉద్యోగం దొరికింది. ఏదో ఒకటి. సర్కారు ఉద్యోగాలు యివ్వటం లేదు. ప్రైవేటే శరణ్యం. బ్రతుకనీ... అనుకున్నాడు తండ్రి నర్సింలు అప్పటికే ఆయనకు పెళ్ళి అయ్యింది. ఇద్దరు పిల్లలు హైదరాబాద్ అలవాటు. అయితే ఏదో ఒక ఉద్యోగం.. పెళ్ళాం పిల్లలను ఇక్కడే వుంచి ఒంటరిగానే వెళ్ళి ఉద్యోగం చేసుకొని బ్రతుకుతూ ప్రతినెలా ఓ రెండు వేలు ఇంటికి పంపాడు పెద్దోడు ప్రసాద్ ఫర్వాలేదు అనుకున్నాడు తండ్రి నర్సింలు.

అయినా తండ్రి నర్సింలుకు తన కొడుకు ప్రైవేటు ఉద్యోగంలో చేరటం నచ్చలేదు. సర్కారు ఉద్యోగాలు కల్పించనప్పుడు ఎవరేమి చేయగలరు?

సర్కారు ఉద్యోగాలు ఎందుకు కల్పించటం లేదో నర్సింలు ఎంత ఆలోచించినా అర్థంకాలేదు.

'సర్కారు'లో ఏ ఉద్యోగాలు లేవు. ఎక్కడ చూచినా 'నో వేకెన్సీ' అసలు ఎందుకు లేవు? ఎందుకు ఫిలప్ చేయటం లేదు? ప్రతి దినం ఎందరో రిటైర్‌మెంట్ అవుతున్నారు. అవన్నీ భర్తీ చేయటం లేదు ఎందుకలా? గతానికి ఇప్పటికీ దేశంలో ఎంతో మార్పు వచ్చింది. ప్రపంచంలోనే పెద్ద మార్పు వచ్చింది. ఎన్నో కొత్త రంగాలు పుట్టుకొచ్చాయి. కొత్త మంత్రులు కొలువుతీరినప్పుడు ఎన్నో కొత్త శాఖలు కనిపిస్తాయి. కొత్త కొత్త రంగాలు కనిపిస్తాయి. మంత్రులకోసం శాఖలా? శాఖల కోసం మంత్రులా? అర్థంకాదు. మంత్రుల కొరకు శాఖలైనా ఫర్వాలేదు? ఉపాధి అవసరం. మంత్రికైనా, ఓ మనిషికైనా, మంత్రుల విషయంలో ఆలోచించినట్టుగా ప్రతి మనిషి విషయంలో సర్కారు ఎందుకు ఆలోచించదో నర్సింలుకు అర్థంకాలేదు.

తాత కథ చెప్పినప్పుడు తాను విన్నాడు ఒక రాజు తన దేశంలో పనిలేనివారు పెరుగుతున్నారని అలా పెరిగితే దొంగతనాలు, మోసాలు, గూండాగిరి పెరుగుతుందని భావించి ఏదో ఒక పని కల్పించాలని దేశంలో కోతులను లెక్కించటానికి వందలాది మందిని నియమించాడట. అది ఉపాధి కొరకు కోతుల లెక్కతో దేశానికి వచ్చేది కాదు, పోయేది కాదు. కోతుల లెక్క అయ్యేది కాదు. మనిషికి ఓ పని కడుపు నింపుకోవటానికి ఓ పని.. ఇక్కడి ప్రభుత్వాలు ఎందుకు అలా ఆలోచించటం లేదో నర్సింలుకు అర్థం కాలేదు. ముగ్గురితో చేయించే పని ఒక్కరితో చేయించటం అన్నిటా 'యంత్రాలు' ప్రవేశపెట్టటం మానవశక్తి అధికంగా వున్న మన దేశంలో 'యంత్రాలు' అవసరమా? వందమంది చేసే పని ఒక యంత్రం చేయటంతో వందమంది మట్టి కొట్టుకపోయినట్టేగా!

నర్సింలుకు చాలా విషయాలు అర్థంకాలేదు. ప్రభుత్వం అన్ని శాఖలు తన గుప్పిట్లో వుంచుకుంటే 'ఉద్యోగాలు' అవసరమయ్యేది విద్య – వైద్యరంగం మొత్తం ఇతరులకు అప్పగించింది. ఇందులో లక్షల ఉద్యోగాలు కల్పించవచ్చు. ప్రభుత్వం కావాలని చేస్తున్న దగాకోరుతనం అనుకొన్నాడు నర్సింలు.

చాలా జాగ్రత్తగా ఆలోచించగా రెండు రంగాలలో ప్రభుత్వం ఉద్యోగులను భర్తీ చేస్తున్నట్టుగా వుంది. ఉపాధ్యాయరంగం – పోలీసు రంగం. ఉద్యోగాలు కల్పించటం ప్రభుత్వ బాధ్యత. అది మనిషికి ఉపాధి కల్పించటం తన బాధ్యతనుండి ప్రభుత్వం తప్పించుకుంది ఉపాధ్యాయరంగంలో ఉద్యోగాలు మొక్కుబడిగా వున్నాయి. 'పోలీసు రంగం'లో ఉద్యోగాలు ప్రభుత్వంకు తప్పనిసరి అయ్యాయి. ఎందుకంటే తమను తాము రక్షించుకోవాలి. తమ చర్యలవలన 'ప్రజలు' వ్యతిరేకులవుతున్నారు. ఏదో రూపంలో 'నిరసన' వ్యక్తీకరిస్తున్నారు. తమను తాము రక్షించుకోవాలంటే – రేపు 'తిరుగుబాటు' రాకుండా చూడాలంటే పోలీసులు అవసరం అందుకే పోలీసుల ఉద్యోగాలు సృష్టించారు, నింపుతున్నారు. రకరకాల పేర్లతో రక్షణ శాఖలో రక్షకశాఖలో ఉద్యోగాలు పుడుతున్నాయి.

ఎందుకీ ఆలోచన అనుకున్నాడు నర్సింలు తన కొడుకు గూర్చి ఆలోచించాల్సింది పోయి దేశం గూర్చి ఆలోచిస్తున్నానేమిటీ? తన కొడుకు ఉద్యోగానికి దేశ పరిస్థితికి సంబంధం వుంది అనుకున్నాడు నర్సింలు 'బడ్జెట్ లేదు' అనేది ఓ సాకు. ప్రజా ప్రతినిధులు అత్యున్నత అధికారుల జీత భత్యాలకు, విలాసాలకు పర్యటనలకు, విందులకు వేల కోట్లు ఖర్చు అవుతున్నాయి. గవర్నర్‌ల అత్యున్నత అధికారుల జీతాలు చూస్తే తల తిరుగుతుంది. ఈ మధ్యనే నర్సింలు పత్రికలో చదివినట్టు జ్ఞాపకం ఒక ప్రైవేటు బ్యాంకు సి.ఇ.వో. జీతం సంవత్సరానికి రెండు కోట్లు... అక్షరాలా రెండు కోట్ల పైనే... రెండు కోట్లు అంటే నెలకు రెండు లక్షలు. ఈ జీతంతో రెండు వందల



8-7-2009న గురుపూర్ణిమ సందర్భంగా కళా సుబ్బారావు వేదికలో నోరి నరసింహశాస్త్రి ట్రస్ట్ తరపున దివాకర్ల వెంకటావధాని పురస్కారంలో రచయిత్రి శ్రీ గిరిరాజు విజయలక్ష్మిని సత్కరించిన దృశ్యం. చిత్రంలో కళా వెంకట దీక్షితులు నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీ విద్యానృసింహ భారతీస్వామివారు, ఆంధ్రప్రభ ఎడిటర్ శ్రీ విజయబాబు ఉన్నారు.

మందికి ఉపాధి కల్పించవచ్చు.

తాను తల బ్రద్దలు కొట్టుకుంటే ఏమి వస్తుందనుకున్నాడు నర్సింలు. తన కొడుకు భవిష్యత్తు గూర్చి ఆలోచించాలి. డిగ్రీ అయి పోయింది. ఎం.బి.ఎ. చదివించాలా? వద్దా?-

⌛ ⌛ ⌛

అల్లం నర్సింలు తన రెండో కొడుకు ప్రకాష్‌ను అనుకున్న ప్రకారం ఎం.బి.ఎ. చదివించాలా? వద్దా? అని ఆలోచించటానికి కొన్ని కారణాలున్నాయి, బయటకు అనటం లేదు. ఎవరితో చర్చించటం లేదు. అసలు ఆ మాటే తీయటం లేదు. మనసులో మాత్రం ఘర్షణ పడుతున్నాడు. పైసలు లేక కాదు. రెండు లక్షలు అప్పు తెచ్చి వుంచుకున్నాడు. పరిస్థితులు బాగులేక కాదు. ఇంట్లో అన్నీ అనుకూల పరిస్థితులున్నాయి. ఆయనకు ఒక అనుమానమొచ్చింది. రెండు లక్షలు పెట్టి ఎం.బి.ఎ. చదివిస్తే ఉద్యోగం దొరుకుతుందా? దొరకక పోతే చదివించి లాభమేమిటీ? సంవత్సరం క్రితం ఎం.బి.ఎ. చదివిస్తే ఉద్యోగం ఖాయం అన్నారు. ఖాయం అన్నారు కనుక చదివించాలనుకున్నారు. ప్రకాష్ కూడా ఎం.బి.ఎ. పట్ల ఆసక్తిగా వున్నాడు.

ఆరు మాసాలక్రితం మొదటకొడుకు ప్రసాద్ తనను ఉద్యోగం నుండి తీసివేశారని హైదరాబాద్ నుండి రాగానే అల్లం నర్సింలు గుండెల్లో రాయిపడింది. గడియారం ఫ్యాక్టరీకి నష్టం వచ్చింది. సగం ఉద్యోగులను తీసివేశారు. తనను తీసివేసారని" ప్రసాద్ చెప్పాడు. ఈ మాట చెప్పగానే రెండో కొడుకును ఎం.బి.ఎ. చదివించాలా వద్దా అనే అనుమానం మొదటిసారి వచ్చింది. తండ్రి నర్సింలుకు అయితే మనసులోనుండి 'అనుమానం' ను ఊడబెరికి పారేశాడు. ఎందుకంటే డిగ్రీ ఎక్కడ ఎం.బి.ఎ. ఎక్కడ? అనుకొన్నాడు. నేను ఆటో నడుపుకొని బ్రతుకు తాను ఆటో ఖరీదు చేయటానికి ఎక్కడైనా అప్పుతే నాన్న" అన్నాడు ప్రసాద్.

తండ్రి బాగా ఆలోచించాడు రెండో కొడుకును ఎం.బి.ఎ. చదివించాలనుకొన్నాం. వాడికి ఉద్యోగం దొరుకుతుంది. ఉన్న మూడుఎకరాలు ఎవరు చేస్తారు? ఇప్పుడంటే తనకు రెక్కలున్నాయి తర్వాత. పాపం ఆటో నడఫటమెందుకు? "పొలం చెయ్యి నాన్నా ఆటో ఎందుకూ?- కల్సి చేసుకుందాం ఎక్కువ పండిద్దాం. అన్నాడు అలా పెద్ద కొడుకు డిగ్రీ చదివి ఉద్యోగం దొరకక పొలం దున్నటం ప్రారంభించాడు.

⌛ ⌛ ⌛

ఆరు నెలలుగా ఆ నోట ఈ నోట ఒక మాట మొదలయ్యింది. "ఎం.బి.ఎ. చదివినా ఎం.సి.ఎ. చదివినా ఏం చదివినా ఉద్యోగాలు లేవు. డాక్టర్ చదివిస్తే ప్రాక్టీస్ చేసుకొని బ్రతకొచ్చు. డాక్టర్ చదవటం లక్షల ఖర్చు. బాగా వున్నోళ్ళ చదువు అది. వున్న ఉద్యోగులనే తీసివేస్తున్నారు" ఈ మాటతో నర్సింలు తన రెండో కొడుకు ఎం.బి.ఎ. చదువు గూర్చి - ఆలోచించి - ఆలోచించి పగలు - రాత్రి ఆలోచించి నెలంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. ఒకనాడు ఉదయం బీడీలు చేస్తున్న భార్యకు దగ్గరగా కూర్చొని రెండో కొడుకు ప్రకాష్‌ని పిల్చి "ఎం.బి.ఎ. చదువు గూర్చి నీ అభిప్రాయం ఏమిటీ లక్షలుపోసి చదివిస్తే ఉద్యోగం ఖాయం కాదంటున్నారు" అన్నాడు మెల్లగా కొడుకును చెయ్యిపట్టి తన పక్కన కూర్చోబెట్టుకుని-

ఎం.బి.ఎ. చదువుగూర్చి ప్రకాష్‌కు కూడా అనుమానముంది. రెండు సంవత్సరాల చదువు. హైదరాబాద్‌లో వుండి చదివితే తక్కువగా ఐదు లక్షల ఖర్చుగావచ్చు. నాన్నతో అప్పు చేయించి చదివితే - ఉద్యోగం దొరకక పోతే...?" భయపడ్డాడు ప్రకాష్.

బీడీలు చేస్తున్న తల్లి అంది గట్టిగానే లక్షలు పోసి చదువుడెందుకు? దండగ నీళ్లలో పోసినట్టుగా.. ఆమెకు చదివించాలని లేదు. అప్పుచేసి చదివించటం. హైదరాబాద్‌లో ఒంటరిగా చదివించటం... అదీ చిన్నకొడుకును. "నా మాట విను నాన్నా అంతా అయోమయంగా వుంది చదువు వద్దు. రెండు లక్షలున్నాయి ఇంకో లక్ష రెండు లక్షలు పెడతాను. ఎలాగూ చదువుకు పెట్టాలిగా మూడు ఎకరాల పొలం కొంటాను దున్నుకొని బ్రతుకు నాన్నా చదువు వద్దు ఏమీ వద్దు" అన్నాడు తండ్రి.

"నీ యిష్టం నాన్నా" అన్నాడు ప్రకాష్ అయిష్టంగా గాదు యిష్టంగానే ఇది నయం అనుకున్నాడు.

"ఇది నయం బ్రతుకు ధోకా లేదు" అంది తల్లి

"ఆస్తి అయినా వుంటుంది. లక్షలు పోసి చదివిస్తే సర్టిఫికెట్స్ తప్ప ఏమీ వుండవు. కాగితాలకు విలువవస్తే వస్తుంది. లేకపోతే లేదు" అన్నాడు తండ్రి నర్సింలు. ఇంతలోనే నిజామాబాద్ గంజికెళ్లిన పెద్ద కొడుకు ప్రసాద్ వచ్చాడు. పండించిన ధాన్యాన్ని గంజికి తీసుకెళ్ళాడు అమ్మటానికి-

రాగానే యింట్లో అడుగు పెట్టగానే అన్నాడు.

"వడ్లకు ధర రాలేదు నాన్నా ధర లేదు. ఈసారి పొలం దండుగే నష్టం నాన్నా" అన్నాడు.


# సమస్యల్లో ఉన్న స్త్రీల కోసం

# భూమిక హెల్ప్‌లైన్

(కేవలం ఫోన్ ద్వారానే)



సలహా, సమాచారం కోసం సంప్రదించండి

**టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 2908**

(మీ వివరాలను గోప్యంగా వుంచడం మా బాధ్యత)

Our cause is supported by OXFAM